క్లుప్తంగా

వరాహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న శంకర సేవా సమితి సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో వరాహ స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం శంకర సేవా సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీచంద్రశేఖర సరస్వతి స్వాములు 1983లో దేశమంతా పర్యటించి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు ఇచ్చారని తెలిపారు. దీన్ని పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 14 రోజులపాటు ఉన్నారని, ప్రతి నిత్యం హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తూ భక్తులకు ప్రవచనాలు అందించారని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవం



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ దంపతులు, కుటుంబ సమేతంగా మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ రకాల ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని స్వామిని మొక్కుకున్నట్లు చైర్‌పర్సన్ దంపతులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్: మండల వ్యవసాయశాఖ అధికారి(ఏఓ)గా కొమరయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఓ రజిత పరిగికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పని చేస్తున్న కొమరయ్య తాండూరుకు వచ్చారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉండి.. వారి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

రైతుల ఫిర్యాదులు స్వీకరిస్తాం

దౌల్తాబాద్: మూడు విడతల్లో రుణాలు మాఫీ కానీ అర్హులైన రైతులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరిస్తామని ఏఓ లావణ్య పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నంబర్లలో తప్పులున్న ఖాతాలు, పాస్‌బుక్ నంబర్లు లేనివి, పేర్లు తప్పుగా ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ.రెండు లక్షలకు పైబడి రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం నుంచి రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆదేశాలు వెలువడతాయని రైతులు వేచి చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు న్యాయం చేసేందుకు మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

రుణమాఫీ ఎప్పుడవుతుంది?



ఏఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

కొడంగల్ రూరల్: రైతు రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించాలని వ్యకాసం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీ కాని రైతుల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యూ కట్టిన రైతులు

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ తమకు రాలేదని మండలానికి చెందిన పలువురు రైతులు వ్యవసాయ కార్యాలయానికి మంగళవారం క్యూ కట్టారు. మూడు విడతల్లో రుణమాఫీ కాని రైతులు కార్యాలయానికి తరలివచ్చారు. దీంతో ఎవరూ ఆందోళన చెందవద్దని ఏడీఏ రుద్రమూర్తి రైతులకు నచ్చజెప్పారు.

ఆస్తులున్నా.. దీపం కరువు!

రూ.కోట్ల ఆస్తులున్న దేవాలయాల్లో దీపం వెలిగించేందుకు నిధులు కరువయ్యాయి. ఆలయ భూములు దండిగా ఉన్నా వాటి నుంచి ఆదాయం సృష్టించేందుకు సరైన మార్గాలు లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఫలితంగా ఆలయాలకు ధూప, దీప నైవేద్యాలకు ఇబ్బంది కలుగుతోంది.

- ఆలయాల్లో ధూప, దీప నైవేద్యానికి ఇబ్బందులు
- దేవాదాయ భూములను కౌలుకు ఇవ్వాలని భక్తుల డిమాండ్



మోమిన్‌పేటలోని వేంకటేశ్వరాలయం



ఆలయ భూములను స్వాధీనం చేసుకొని బోర్డులను పాతిన అధికారులు (ఫైల్)

మోమిన్‌పేట: మండల కేంద్రమైన మోమిన్‌పేటలో పురాతనమైన బాలాజీ, మానిక్ ప్రభు ఆలయాలకు రూ.కోట్లు విలువ చేసే ఆస్తులున్నా ధూప దీప నైవేద్యాలకు నిధులు లేని పరిస్థితి దాపురించింది. దేవాదాయ శాఖ ఆధీనంలో లేని మాన్యం భూములు కౌలుకు ఇవ్వకపోవడంతో మహోత్సవాలకు నిధుల కరువుతో మమ అనిపిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. బాలాజీ దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో 16 సంవత్సరాల క్రితం ఆలయ పునర్నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.30 లక్షలు మంజూరు చేశారు. వాటితో ఆలయ జీర్ణోద్ధరణ పూర్తి చేశారు. మాణిక్ ప్రభు ఆలయాన్ని సైతం శిథిలావస్థకు చేరడంతో దాతల సహాయంతో మరమ్మతులు చేపట్టారు. కానీ ఆలయాలకు కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్తులున్నా స్వామి వారి నిత్య ధూప దీప నైవేద్యాలకు మాత్రం ఉపయోగపడట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా భక్తులిచ్చే కానుకలతో అర్చకులు పూజలు నిర్వహిస్తున్నారు. దేవాదాయశాఖ ఆలయ భూములను స్వాధీనం చేసుకొని వేలం పాట ద్వారా కౌలుకు ఇస్తే భారీగా ఆదాయం సమకూరుతుందని భక్తులు పేర్కొంటున్నారు.

మాణిక్ ప్రభుకు 42 ఎకరాల మాన్యం

మాణిక్ ప్రభు దేవాలయం అభివృద్ధి కోసం కొంత మంది దాతలు 42.04 ఎకరాల భూమిని అప్పగించారు. కాస్లబాదులోని 46 సర్వే నంబరులో 6 ఎకరాల 32 గుంటలు, మోమిన్‌పేటలోని సర్వే నంబర్ 378లో 6ఎకరాల 11గుంటలు, 381లో 6 ఎకరాల 23గుంటలు, 391లో 16ఎకరాల 11గుంటలు, 394లో 6ఎకరాల 04గుంటలతో కలిపి మొత్తం 42ఎకరాల 04గుంటల వ్యవసాయ భూమి ఉంది.

వేంకటేశ్వర స్వామికి 31 ఎకరాలు

శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి నిత్య ధూప దీప నైవేద్యాలు సమర్పించేందుకు దాతలు 31ఎకరాల 06గుంటల వ్యవసాయ భూమిని ధారాదత్తం చేశారు. మోమిన్‌పేటలోని సర్వే నంబరు 443లో 9ఎకరాల 19గుంటలు, 444లో 2ఎకరాల 20గుంటలు, 445లో 2ఎకరాల 34గుంటలు, 444లో 16ఎకరాల 16గుంటలతో కలిపి మొత్తం 31ఎకరాల 06గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ ఆలయాలకు సదరు భూమిపై ఎలాంటి ఆదాయం రావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం దేవాదాయ శాఖాధికారులు ఈ భూమిని గుర్తించి బోర్డులు పాతి వెళ్లారు. వెంటనే భూములను స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం నిర్వహించి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కానీ ఇంతవరకు అటువైపు అడుగులు పడలేదు.

అనుమతులు రాలేదు

బాలాజీ, మానిక్ ప్రభు ఆలయాలకు భూములు ఉన్న మాట వాస్తవమే. ఇంకా వేలం నిర్వహించేందుకు అనుమతులు రాలేదు. మానిక్ ప్రభు మందిరానికి సంబంధించిన భూములు వ్యవసాయయోగ్యానికి పనికి రాకుండా ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న భూమిని ఎవరికైనా వాణిజ్య కార్యకలాపాల కోసం లీజుకు ఇస్తాం. త్వరలో మాన్యం భూములను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, ఈఓ, దేవాదాయశాఖ

తాగునీటి సమస్య రాకుండా చూడండి

ఎంపీడీఓ జర్నప్ప

సాక్షి ఎఫెక్ట్..



మంబాపూర్ ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ

పెద్దేముల్: మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినందున గ్రామాల్లో పాత బోరు మోటార్లకు మరమ్మతులు చేయాలని ఎంపీడీఓ జర్నప్ప సూచించారు. మంగళవారం మండలంలోని మంబాపూర్, బండపల్లి, ఖాణాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఎంపీడీఓ, ఎంపీఓ రతన్‌సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించి గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఆరా తీశారు. మంబాపూర్‌లో నీటి సమస్య తీర్చాలంటూ సోమవారం గ్రామ ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కడంతో ఆయా వార్డుల్లో అధికారులు పర్యటించారు. పాత, బోరు మోటార్లను వెంటనే రిపేరు చేసి నీటి సమస్య రాకుండా చూడాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఖాణాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి లేక సక్రమంగా తాగునీరు, వీధి లైట్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. దీంతో ఎంపీడీఓ బుద్ధారం కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



దోమ సమీపంలో రోడ్డుపై నిలిచిపోయిన బస్సు

దోమ: గమ్యస్థానం చేర్చాల్సిన ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుల్తాన్‌పూర్, ఊటుపల్లి, తిమ్మాయపల్లి నుంచి దోమ మీదుగా అటు పాలేపల్లి, ఐనాపూర్, దాదాపూర్ వెళ్లాల్సి ఉంది. అయితే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపానికి రాగానే అకస్మాత్తుగా మొరాయించింది. అందులో ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. కాలం చెల్లిన బస్సులను ఈ రూట్‌లో నడిపించడంతో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

దంచిన వాన.. పొంగిన కాగ్నా



డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న కాగ్నానది

ధారూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి వర్షం దంచి కొడుతుంది. కోట్‌పల్లి ప్రాజెక్టులోకి 17 అడుగుల వరకు వరద నీరు చేరింది. వర్షానికి వాగులు, కాగ్నానది ఉప్పొంగుతున్నాయి. కాగ్నానది స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగా నిర్మిస్తున్న వంతెన పక్కనే ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుపై నుంచి మంగళవారం రాత్రి వరకు కూడా కాగ్నా ప్రవహించడంతో నాగారం, రాస్నం వైపునకు వెళ్లే 30 గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వానాకాలం పంటలకు ఈ వాన మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ముగ్గురు ఏఈఓల బదిలీ

దౌల్తాబాద్: మండలంలో వ్యవసాయశాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఏఈఓలు సోమవారం రాత్రి బదిలీ అయ్యారు. నందారం క్లస్టర్ ఏఈఓ శ్రీపతిరెడ్డి కొడంగల్ మండలానికి, కుదురుమళ్ల క్లస్టర్ ఏఈఓ సాయివాణి రంగారెడ్డి జిల్లాకు, బిచ్చాల క్లస్టర్ హరికకు దోమ మండలానికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా ఎవరూ చేరలేదు.

రోడ్డు వేయించాలని వినతి

కొడంగల్ రూరల్: బొంరాస్‌పేట మండలం కొత్తూరు నుంచి దేవనూర్ వరకు బీటీ రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం పట్టణంలోని కడా కార్యాలయ సిబ్బందికి ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. గత 20 ఏళ్లుగా రోడ్డుపై గుంతలు పడి ఇబ్బందులకు గురవుతున్నామని వినతిలో పేర్కొన్నారు. ఇప్పటివరకు తాత్కాలిక పద్ధతిలో పలుమార్లు మొరం మట్టిని మాత్రమే వేశారని, వర్షం చినుకులకు మట్టి కొట్టుకు పోవడంతో గుంతలమయంగా మారుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కొత్తూరు నుంచి దేవనూర్ వరకు బీటీ రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తురు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ.రమేశ్‌బాబు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

దోమ: ఓటు వయసు కలిగిన(18 ఏళ్లు) ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ సోమలింగంతో కలిసి బీఎల్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలోని యువతి, యువకులు 18 సంవత్సరాలు నిండినట్లయితే నూతన ఓటరు కార్డుకు ఆన్‌లైన్, లేదా బీఎల్‌ఓల ద్వారా నమోదు చేసుకోవడానికి కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

బంట్వారం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. వీరిలో 8 మందికి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని నగరంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యానికి రెఫర్ చేశారని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, వందన, సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, ఎన్సీడీ కోఆర్డినేటర్ జయరాముడు, హెచ్‌ఈఓ రవీందర్‌రెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి



పరిగి: రాజీవ్‌గాంధీ జయంతిలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పరిగి: దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను ప్రజలు ఎన్నటికి మరువరని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని పరిగి పట్టణ కేంద్రంలో టీఆర్ఆర్ నివాసంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు.



పెద్దేముల్: రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద..



తాండూరు టౌన్: రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నేతల నివాళి

తాగు నీటికి కటకట



దౌల్తాబాద్: ట్యాంకర్ వద్ద మహిళలు, చిన్నారుల పాట్లు

గ్రామాలు, పట్టణాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా కొన్ని రోజులుగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్లాంట్‌లో తలెత్తిన సాంకేతికలోపం కారణంగా సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. త్వరితగతిన పరిష్కరించి నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

- నిలిచిపోయిన మిషన్ భగీరథ నీరు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొడంగల్: నియోజకవర్గంలో తాగునీటికి కటకట ఏర్పడింది. మిషన్ భగీరథ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయింది. ఈ మేరకు మంగళవారం కొడంగల్ మున్సిపల్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దీంతో ప్రజలు కనీస అవసరాలకు నీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.



తాండూరు టౌన్: డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖాళీ బిందెలతో నిరసన

తాండూరు టౌన్: బీజేపీ తాండూరు పట్టణ నాయకులు ఖాళీ బిందెలతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కొన్ని రోజులుగా పట్టణంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశం నాయకులు శాంతకుమార్, భద్రేశ్వర్, ఆంజనేయులు, రజినీకాంత్, కిరణ్, శ్రీకాంత్, ప్రభాకర్‌గౌడ్, చందు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా ఇబ్బంది

దౌల్తాబాద్: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. గ్రామంలో వివిధ కాలనీల్లో తాగునీరు రాకపోవడంతో మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీరు బంద్ కావడంతో నీటి కష్టాలు ఏర్పడ్డాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో తాగునీటి బోర్లు లేకపోవడంతో పొలాల వెంబడి తెచ్చుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి గోపాల్ ట్యాంకర్ ద్వారా కొన్ని కాలనీలకు సరఫరా చేయిస్తున్నారు.



భారీ వర్షం.. మూసీ ఉధృతం

మండలంలో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుసున్నాయి. మండల పరిధిలోని ఎల్లకొండ, పులుమామిడి, నవాబుపేట, చించల్‌పేట, అక్నపూర్, నారెగూడ, గంగ్యాడ, చిట్టిగిద్ద తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. దాంతో గ్రామాల్లోని వాగులు పొంగి పొర్లాయి. టమాట, వంకాయ తదితర కూరగాయలు పంటలకు సైతం నష్టం వాటిల్లింది. మండలం మీదుగా 16 కిలోమీటర్లు ప్రవహించే మూసీ నది పొంగింది. – నవాబుపేట

హిందువులపై దాడులు సరికాదు



మోమిన్‌పేట: ర్యాలీ నిర్వహిస్తున్న

మోమిన్‌పేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసకు నిరసనగా మండల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దౌర్జన్యం ఆపాలని కోరారు. కార్యక్రమంలో వాణిజ్య దుకాణదారులు, మండల ఐక్య వేదిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుదురుమళ్లలో విద్యార్థుల ర్యాలీ

దుద్యాల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గ్రామస్తులు, విద్యార్థులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కుదురుమళ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

నిందితులను శిక్షించాలి

దౌల్తాబాద్: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కుదురుమళ్ల యువజన సంఘం నాయకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళా వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రం

నేరగాళ్ల ఆట కట్టించేందుకు పోలీసులకు సీసీ కెమెరాలు వజ్రాయుధం వంటిది. కీలక సమయంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. కానీ గ్రామాల్లో నిఘా వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారింది. పని చేయని సీసీ కెమెరాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- మైతాప్‌ఖాన్‌గూడలో పని చేయని సీసీ కెమెరాలు
- మూడు జిల్లాల సరిహద్దులో నిఘా కరువు



పాడైన సీసీ కెమెరాలు



మైతాప్‌ఖాన్‌గూడ ప్రధాన చౌరస్తా

నవాబుపేట: నేరాల నియంత్రణలో మూడో నేత్రంగా భావించే సీసీ కెమెరాలే కీలకం. వీటితో నేరస్తులను పట్టుకోవడంతోపాటు నేరాలను చాకచక్యంగా అరికట్టవచ్చు. నేటి సాంకేతికయుగంలో అంతటి ప్రాధాన్యం నిఘా నేత్రాలకు ఉంది. కానీ మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడలో మాత్రం సీసీ కెమెరాల నిర్వహణను గాలికొదిలేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల పని తీరు మున్నాళ్ల ముచ్చటగా మారింది. అవి పని చేయడం మాని రెండేళ్లయినా.. వాటి వైపు కన్నెత్తి చూసే నాథుడే లేకుండా పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే నారేగూడ, గంగ్యాడ, అక్నాపూర్, చించల్‌పేట గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలు నిద్రావస్తను వీడడం లేదు.

కీలక గ్రామం

మైతాప్‌ఖాన్‌గూడ గ్రామానికి మూడు జిల్లాలతో సరిహద్దు ఉంది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు ఈ గ్రామం గుండానే రాకపోకలు సాగుతుంటాయి. స్థానిక ప్రధాన చౌరస్తా ప్రయాణికులతో 24 గంటలపాటు బిజీగా ఉంటుంది. ముఖ్యంగా సంగారెడ్డి నుంచి ఇసుక అక్రమ రవాణా భారీగా వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సరఫరా అవుతుంది. అలాగే నవాబుపేట మండలం నుంచి అక్రమ కలప వ్యాపారం శంకర్‌పల్లి, సంగారెడ్డికి జరుగుతోంది. సరిహద్దు కావడంతో మూడు జిల్లాల మద్యం ప్రియులు ఇక్కడికి వస్తుంటారు. దీంతో గ్రామం మరింత రద్దీగా మారింది. అలాంటప్పుడు నేరాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దాదాపు రెండేళ్ల నుంచి పని చేయడంలేదు. అప్పట్లో గ్రామ సర్పంచ్ రూ.2.5 లక్షలు ఖర్చు పెట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం పదవిలో లేకపోవడంతో నిర్వహణ చూసే వారు కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.